ఓటర్లు పోటెత్తేలా..!

- ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక బృందాలు
- మండల స్థాయిలో పర్యవేక్షణ చేయనున్న కమిటీలు
- 2019 ఎన్నికల్లో వెస్ట్‌లో 58.19 శాతం పోలింగ్
- మిగతా నియోజకవర్గాల కంటే ఇక్కడే తక్కువ
- 41 పోలింగ్ స్టేషన్లలో సగటు ఓటింగ్ 33 శాతం
- అత్యల్ప పోలింగ్ నమోదైన బూత్‌ల గుర్తింపు
- ఈసారి పోలింగ్ శాతం పెంచేలా కార్యాచరణ



ఓటరు చైతన్య సదస్సు

విశాఖ విద్య: ఎన్నికల సంగ్రామానికి తెరలేచింది. ఓటరు జాబితాలకు తుది రూపు ఇచ్చిన యంత్రాంగం, ప్రస్తుతం ఎన్నికల నిర్వహణపై ఫోకస్ పెట్టింది. గత ఎన్నికల్లో తక్కువ శాతం పోలింగ్ నమోదైన ప్రాంతాల్లో ఈ సారి ఓటర్లు పోటెత్తేలా అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 2,09, 424 మంది ఓటర్లు నమోదయ్యారు. వీరిలో పురుషులు 1,03,248, మహిళా ఓటర్లు 1,06,166 మంది, ఇతరులు 10 మంది ఉన్నారు. నియోజకవర్గంలోని 14 వార్డుల్లో 220 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా నిబంధనలు పక్కాగా అమలు చేసేందుకు ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ నేతృత్వంలో యంత్రాంగం అప్రమత్తమైంది.

2019లో పోలింగ్ సరళి

నియోజకవర్గంలో 2019 నాటి ఎన్నికల్లో 2,36,310 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,37,499 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 58.19 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కంటే పశ్చిమ నియోజకవర్గంలోనే తక్కువ శాతం నమోదైనట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. జిల్లా సగటు 66.25 శాతం కాగా, దీని కంటే పశ్చిమ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం తక్కువ కావడం గమనార్హం.

1250 మందిలో ఓటు వేసింది 61 మందే ..

అప్పటి 49వ వార్డు పరిధిలోని గాంధీగ్రామ్ షిప్‌యార్డ్ కాలనీ(163 బూత్)లో 1,250 మంది ఓటర్లు ఉండగా 61 మంది మాత్రమే ఓటు వేశారు.

- షిప్‌యార్డు కాలనీలోని 160వ బూత్‌లో 1,279 మందికి గాను 91 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో ఇలా 41 పోలింగ్ స్టేషన్లలో సగటున 33.76 శాతం ఓటింగ్ నమోదైంది.

ఆలోచనలో పడేసిందిలా..

2019 లెక్కల ప్రకారం ప్రతీ వందమందిలో 34 మంది మాత్రమే ఓటు వేశారన్న మాట. ఇలాంటి అంశాలను ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



కాలేజీ విద్యార్థులకు ఓటు వినియోగంపై అవగాహన

ప్రజా తీర్పునకు అద్దం పట్టేలా..

నియోజకవర్గంలో ఈ సారి నూరుశాతం పోలింగ్ లక్ష్యంగా అధికారులు పక్కా కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. 2019లో తక్కువ ఓటింగ్ నమోదైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి.. ఎందుకలా జరిగింది అనే అంశంపై అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పారిశ్రామిక ప్రాంత పరిధి విస్తరించి ఉన్న పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఎక్కువ మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఇలాంటి వారందరినీ తగిన విచారణ అనంతరం జాబితా నుంచి తొలగించారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన కార్మికులు, మత్స్యకారులు , అర్బన్ ప్రాంతంలో రోజువారీ పనులు చేసుకునే వారు, డిఫెన్స్ వంటి కేంద్ర సంస్థల్లో పనిచేసే వారు ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదని గుర్తించారు. ఇలాంటి అంశాలపై ప్రజానీకంలో విస్తృతమైన అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విస్తృత అవగాహన



అర్హులైన ఓటర్లు ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలి. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచనల మేరకు దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. సచివాలయ స్థాయిలో ఓటర్లకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. మండల స్థాయి కమిటీలు అవగాహన కార్యక్రమాలను పర్యవేక్షణ చేస్తాయి.

– కె. రామారావు, నోడల్ అధికారి

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి



ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకున్న వారంతా ఓటు వేయాలి. ఇందు కోసం ప్రజానీకంలో చైతన్యం తీసుకొచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచనల మేరకు మండల స్థాయిలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశాం. అంతా సమన్వయంతో పనిచేస్తున్నాం.

– హుస్సేన్ సాహెబ్, రిటర్నింగ్ అధికారి, విశాఖ పశ్చిమ నియోజకవర్గం

క్లుప్తంగా

వలంటీర్‌కు పరామర్శ


హిమబిందును పరామర్శిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు కరాసలో వార్డు వలంటీర్‌గా పనిచేస్తున్న హిమబిందు బుధవారం రోడ్డు ప్రమాదంలో గాయపడింది. న్యూ కరాస సమీపంలో ద్వి చక్రవాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆస్పత్రికి వెళ్లి హిమబిందును పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట వెదుళ్ల శ్రీను తదితరులు ఉన్నారు.

శోభన్‌బాబుకు సేవా నివాళి


శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కంచరపాలెం: సిటీవైడ్ శోభన్‌బాబు కంచరపాలెం ఫ్యాన్స్ ఆధ్వర్యంలో బుధవారం రామ్మూర్తిపంతులుపేట మహాత్మా గాంధీ గ్రంథాలయం వద్ద నటభూషణ్ శోభన్‌బాబు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శోభన్‌బాబు విగ్రహానికి అభిమానులు పూలమాలలు వేసిన నివాళులర్పించారు. సంఘసేవకు మారుపేరుగా నిలిచిన మహోన్నత వ్యక్తిగా శోభన్‌బాబు కీర్తిని ఆర్జించారని కొనియాడారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం 2 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొణతాల వెంకటరావు, వెంకటేశ్వరరావు, విజయకుమార్, ఎం.సూర్యనారాయణ, జి.ఫణిభూషణరావు, పి.పైడిరాజు, డి.వి.రావు, టి.ఎస్.బాబు, పి.మురళీరాజు, పి.దేవకి, కె.సూర్యరత్నం, కొణతాల సతీష్, మళ్ల నాగేంద్ర, ఆళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

సూర్యకుమారి సేవలు చిరస్మరణీయం


సూర్యకుమారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, కార్పొరేటర్లు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రాంత ప్రజలకు దివంగత దాడి సూర్యకుమారి కార్పొరేటర్‌గా అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అన్నారు. సూర్యకుమారి 3వ వర్ధంతి సందర్భంగా ఆర్‌కే పురం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్పొరేటర్లు కొణతాల సుధ, పి.వి.సురేష్, గుండపు నాగేశ్వరరావు తదితరులతో కలసి సూర్యకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి సత్యనారాయణ, మధు, ఆడారి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నీ

విశాఖ స్పోర్ట్స్ : ఆలిండియా ఆహ్వాన వాలీబాల్ చాంపియన్‌షిప్ డీఆర్ఎం కప్ ఈకోర్నా వాల్తేర్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రారంభం కానుంది. మెన్‌లో ఎనిమిది జట్లు.. వుమెన్‌లో నాలుగు జట్లు పోటీపడనున్నాయి. నాలుగు రోజుల పాటు రైల్వే స్టేడియం వాలీబాల్ కోర్టులో జరిగే ఈ పోటీల్లో కిట్ యూనివర్సిటీ, డిబి క్లబ్, ఈకోరైల్వే, సాయ్, సెయింట్ జాన్స్ కాలేజ్, తూర్పు గోదావరి, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లా జట్లు మెన్‌లో తలపడనుండగా.. వుమెన్‌లో కిట్ వర్సిటీ, జేపీయర్ యూనివర్సిటీ, చెన్నై కాలేజ్, ఎన్‌టీపీ ట్రస్ట్ జట్లు పోటీపడనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు టోర్నీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈకోర్నా వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్‌భారి, జాయింట్ క్రీడాధికారి బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం


ఆదర్శనగర్‌లో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు


62వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు ఆదర్శనగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అన్ని వర్గాల ప్రజలు మళ్లీ జగనన్న ప్రభుత్వమే కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. తెలుగుదేశం వస్తే సంక్షేమపథకాలు తీసేసి దళారులు పెంత్తదార్లు పుట్టుకొస్తారని వారి బారిన పడకుండా మళ్లీ జగన్ ప్రభుత్వానికే ఓటు వేస్తామని చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో పొలమరశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో ..

సింథియా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు తరాల కోసం ఆలోచించి ఓటు వేయాలని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రజలను కోరారు.

వార్డు పరిధి గుడివాడ అప్పన్నకాలనీలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఆడారి ఆనంద్‌కుమార్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను సొంత నిధులతో చేపట్టి గొప్ప మనసు ఉన్న వ్యక్తిగా మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. అలాంటి నాయకులను గెలిపించుకుంటే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు.

వర్షంతో ఊరట


వర్షంలో తడుస్తూ ప్రయాణం చేస్తున్న దంపతులు

మల్కాపురం: ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది.నిన్నటి వరకు మండే ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన పారిశ్రామిక ప్రాంత ప్రజలు బుధవారం కురిసిన వర్షానికి సేదతీరారు. రోజంతా మబ్బులు ఉండడంతో వాతావరణం కూల్ కూల్‌గా మారింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో మోస్తారు వర్షం కురవడంతో వాహనాలపై రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది చిరుజల్లులను ఆస్వాదించారు.

సురక్ష శిబిరంలో 200 మందికి వైద్యసేవలు


రోగుల వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది


మందులను పంపిణీ చేస్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద గల డాక్టర్ వై.ఎస్.ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వద్ద బుధవారం ఉదయం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. వార్డులోని వాయుపుత్ర కాలనీ సచివాలయం పరిధిలో నివాసితుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి సుమారు రెండు వందల మంది రోగులు వచ్చి, అవసరమైన వైద్య పరీక్షలను చేయించుకున్నారు. వైద్యాధికారి సీహెచ్. వెంకట సాయి రూప ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు పాల్గొని రోగులకు సేవలు అందించారు. అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కథలతో పిల్లల్లో నైతిక విలువలు


పిల్లలకు కథలు చెబుతున్న కథకురాలు వరలక్ష్మి

గోపాలపట్నం: పిల్లలకు విలువలను నేర్పించేందుకు కథలు దోహదపడతాయని ప్రముఖ కథకురాలు రావూరి వరలక్ష్మి అన్నారు. గోపాలపట్నం ప్లే ఐరిస్ ప్రీస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కథలు చెప్పే విధానాన్ని చిన్నారులకు తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ పిల్లలు కథలు బాగా చెప్పగలరని ప్రోత్సహిస్తే, మంచి కథకులుగా మారతారన్నారు. దీనివల్ల వారిలో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. బొమ్మల ఆధారంగా కథలు ఎలా చెప్పగలమో వివరించారు. వీటి వల్ల స్నేహ భావం , అనుబంధాలు పెంపొందించవచ్చని, మనసులను ఆకట్టుకోవచ్చని తెలిపారు. ఆమె చెప్పిన కథలను పిల్లలు ఆసక్తిగా విన్నారు. కార్యక్రమంలో ప్రీస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణలో యువత భాగస్వామ్యం తప్పనిసరి


కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రమాదం సంభవిస్తే యువత ఆదుకోవాలని జిల్లా జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి సూచించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి, కాపాడాలని కోరారు. విపత్తులను ఎలా అధిగమించాలి అనే అంశంపై మల్కాపురం సెయింట్ ఆన్స్ జూనియర్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2 ల ఆధ్వర్యంలో 60వ వార్డు ఇందిరా కాలనీలో సామాజిక భవనం వద్ద బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వృద్ధులను, పిల్లలను సంరక్షించడం తదితర కార్యక్రమాల్లో యువత చురుగ్గా పాల్గోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధికి కృషి


విశాఖ వాణి మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, అధికారులు

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయంలో బుధవారం డివిజనల్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులతో గత త్రైమాసిక ఫలితాలు, 2024-25 సంవత్సర ప్రణాళికలు, రాబోయే రోజుల్లో హిందీ భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, శిక్షణ కోసం నమోదు వంటి విషయాల గురించి చర్చించారు. వాల్తేర్ డివిజన్ ప్రచురించిన విశాఖ వాణి మ్యాగజైన్‌ను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ఆవిష్కరించారు. హిందీ భాష ప్రాముఖ్యాన్ని అన్ని విభాగాల్లో తెలియజేసి, మరింత ఎక్కువ మంది వినియోగించేలా చేయాలని ఆయన సూచించారు. విశాఖ వాణి మ్యాగజైన్‌లో పలు శీర్షికలు రాసిన అధికారులను డీఆర్ఎం అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, వాల్తేర్ డివిజన్ రాజభాషా అధికారి వీరేంద్ర కాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వెండిగరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని అధిష్ఠంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

దంతాల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది


దంత వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు వనితా పావని

గోపాలపట్నం: గోపాలపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఓరల్ హెల్త్‌డే ఘనంగా నిర్వహించారు. దంత పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. దంతాల సమస్య వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలని దంత వైద్యురాలు వనితా పావని అన్నారు. దంతాల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలువురికి దంత వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, పలు విభాగాల వైద్యులు నివేదిత, పూర్ణిమ, భవాని, ప్రవల్లిక, షబ్నం, స్నేహ, రితిన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి లక్ష తులసీదళార్చన


లక్ష తులసి పూజ చేస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం లక్ష తులసి పూజను ఘనంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం రుత్వికులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అర్చన చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావ నారాయణ స్వామి, హరి నారాయణ స్వామి ఆధ్వర్యంలో రుత్వికులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు విడుదల

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ-చెన్నై ఆధ్వర్యంలో గత నెల 10, 11వ తేదీల్లో నిర్వహించిన హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా జరిగిన పరీక్షల్లో 36 మందికి గానూ 25 మంది ప్రథమ శ్రేణిలో, 11 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

'బార్స్ రిజిస్ట్రేషన్‌కు సహకరించండి'

ఉక్కునగరం: బయోమెట్రిక్ అటెండెన్స్ రికార్డింగ్ సిస్టం (బార్స్) రిజిస్ట్రేషన్‌కు అందరూ సహకరించాలని స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కోరారు. బార్స్ అంశంపై ఉక్కు పరిపాలన భవనంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బార్స్‌పై సమస్యలను యాజమాన్యానికి తెలియజేశారు. దీనిపై సీఎండీ మాట్లాడుతూ రెండు నెలల పాటు బార్స్, డార్స్ రెండూ అమలు చేస్తామన్నారు. బార్స్ కారణంగా ఈ రెండునెలలు జీతంలో కోతలు ఉండబోవని సీఎండీ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. మిగతా సమస్యలు బార్స్ కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారన్నారు.డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే, ఉన్నతాధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు ఘన స్వాగతం


శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న ఎన్ఏడీ ఐఎన్‌టీయూసీ నాయకులు

గోపాలపట్నం: ఇండియన్ నేషనల్ డిఫెన్స్ వర్కర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ ఆర్. శ్రీనివాస్‌కు బుధవారం ఎన్ఏడీ ఐఎన్‌టీయూసీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎన్ఏడీ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ గురువారం ఈఎన్‌సీలో ఐఎన్‌టీయూసీ నిర్వహించబోయే సెమినార్‌లో పాల్గొనేందుకు ఆయన విశాఖ వచ్చారని తెలిపారు. సెమినార్‌లో ఎన్‌పీఎస్ రద్దు, 8వ పే కమిషన్ వంటి పలు అంశాలపై మాట్లాడనున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఏడీ ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు పోరాటం


1133వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికుల పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. వారి సంకల్పానికి, పోరాట శక్తికి ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1133వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై శిక్షణ

మధురవాడ : సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల నిర్వహణ, వాటిని భద్రపరచడం ముఖ్యమైన విషయాలని మాస్టర్ ట్రైనీ రెడ్డి మహేష్, నోడల్ అసిస్టెంట్, ఏపీఐఐసీ మేనేజర్ లోహికుమార్ చెప్పారు. విశాఖ తూర్పు నియోజకవర్గం-21 పరిధిలో సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లకు ఎన్నికల నిర్వహణపై మధురవాడ జోనల్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 5 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇక్కడ బుధవారం రెండవ రోజు శిక్షణ ఇచ్చారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో 25 సెక్టార్లు ఉండగా వీరిలో రోజుకు 5 సెక్టార్లకు చెందిన సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరికి మాక్ పోలింగ్, పోలింగ్‌లో తలెత్తే సాంకేతిక, ఇతర అంశాలు, వీటిని తెరవడం దగ్గర నుంచి క్లోజ్ చేసి స్ట్రాంగ్ రూంకి తరలించే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అన్ని విషయాలు కూలంకుషంగా వివరించారు.